క్లుప్తంగా

మూలకు చేరిన.. 108 వాహనం



ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న 108 వాహనం

ఖాజీపేట(చాపాడు) : పేదలకు ఆపత్కాల సయయంలో సేవలందించాల్సిన 108 వాహనం మూలన పడింది. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉంది. వాహనాన్ని అందుబాటులో తీసుకువస్తే రోడ్డు ప్రమాదాల్లో గాయపడే వారికి ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు తెలిపారు.

వాహనాల తనిఖీ

అట్లూరు : మండల పరిధిలోని అటవీ చెక్ పోస్టు సమీపంలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ తనిఖీలో 17 వాహనాలకు రూ.3010లు జరిమానా విధించినట్లు తెలిపారు. అందులో హెల్మెట్ ధరించని 12 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, మిగిలిన 5 వాహనాలకు రికార్డులు సక్రమంగా లేకపోవడంతో జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఎరుకలయ్య, కమలాక్షుమ్మ ఆరాధనా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం శ్రీకృష్ణమందిరంలో స్వామివారికి, మళయాలస్వామి, ఏకరసానంద, కమలాక్షుమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఆశ్రమ ప్రాంగణంలోని వేదికపై ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

వన్య ప్రాణులకు ఆహారం

అట్లూరు : బద్వేలు మున్సిపల్ వైఎస్ చైర్మన్ ఎర్రగొల్ల గోపాలస్వామి వన్య ప్రాణులకు ఆహారం అందించి మానవత్వం చాటుకుంటున్నాడు. సమయం దొరికినప్పుడల్లా కడప–బద్వేలు ప్రధాన రహదారిపై షరాబుదిన్నె సమీపాన అటవీ ప్రాంతంలో అలాగే మైదుకూరు రోడ్డులోని రాణీబావి అటవీ ప్రాంతంలో ఉన్న వానరాలకు తన కారులో అరటి, యాపిల్ తదితర పండ్లను తీసుకెళ్లి వానరాలకు అందించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా వణ్యప్రాణులకు అందుబాటులో ఉంచి వస్తుంటారు. అందులో భాగంగా ఆదివారం మైదుకూరు రోడ్డులోని రాణీబావి దగ్గర వనరాలకు అరటి పండ్లు అందజేశారు.

నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలో నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయనగర్‌లో నీటి సరఫరాను పరిశీలించిన ఆయన కొందరు నీటిని వృథా చేస్తూ వీధుల వెంబడి అపరిశుభ్రత చేస్తున్న వారికి అవగాహన కల్పించారు. బయట ఉన్న కొళాయిలను ఇంటి లోపలికి గాని ప్రహరీ లోపలికి గాని ఏర్పాటు చేసుకుని నీటి వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది నిత్యం వార్డుల్లో తిరుగుతూ పైపులైను లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అక్రమ కొళాయి కనెక్షన్లు గుర్తించి వాటిని రెగ్యులర్ చేయించాలన్నారు. ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి ఉన్నాయని, దీని ద్వారా చుట్టుపక్కల నివాసం ఉన్న వారికి అసౌకర్యంగా ఉందన్నారు. ఇన్‌చార్జి మున్సిపల్ ఏఈ మహేష్, టీపీఓ సతీష్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

బద్వేలు అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ 16వ వార్డు కన్వీనర్ వనంపెంచలబాబు కుటుంబ సభ్యులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే పెంచలబాబు మృతి పార్టీకి తీరని లోటని, పార్టీపరంగా అన్నిరకాలుగా అండగా ఉంటామని సూచించడంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు గురివిరెడ్డి, మౌలాలి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన సంరక్షణ సమితి ఎన్నికలు మళ్లీ నిర్వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్ గాంధీ నేషనల్ పార్కులో వనసంరక్షణ సమితి ఎన్నికలు ఏకపక్షంగా జరిపారని వాటిని తిరిగి నిర్వహించాలని నంగనూరుపల్లె వనసంరక్షణ సమితి సభ్యులు చాపాటి భాస్కర్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ పార్కులో నంగనూరు పల్లె ఎస్సీలకు వీఎస్ఎస్ సభ్యత్వం కల్పించారన్నారు. శనివారం పార్కులో వీఎస్ఎస్ పనిచేయుటకు ఓటింగ్ కోసం ఎఫ్ఆర్ఓ హేమాంజలి, డీఆర్ఓ లక్ష్మీదేవి కమిటీలను ఆహ్వానించారన్నారు. రెండు వర్గాలకు చెందిన ఎస్సీలతో పాటు సభ్యత్వంలేని బీసీలు కూడా ఎన్నికలకు వచ్చారని, గొడవలు జరుగుతాయని వారిని పంపివేయాలని ఎఫ్ఆర్ఓను కోరగా ఆమె స్పందించలేదన్నారు. దీంతో తమ వర్గం వారు ఎన్నికలను బాయ్‌కాట్ చేశాం. అయితే డీఆర్ఓ ఏకపక్షంగా ఎన్నికలను ఏకగ్రీవం చేశారన్నారు. ఎన్నికలు తిరిగి నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. వనసంరక్షణ సమితి సభ్యులు చాపాటి మనోహర్, రామసుబ్బన్న, పెద్దరామయ్య తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ



ముక్తిరామలింగేశ్వరస్వామి



అమృతేశ్వరస్వామి



మరకత లింగేశ్వరస్వామి



అగస్త్యేశ్వరస్వామి మూలవిరాట్

నేడు తొలి కార్తీక సోమవారం

ప్రొద్దుటూరు కల్చరల్ : సిరిపురిగా పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణం పలు ప్రముఖ ఆలయాలకు ప్రసిద్ధి చెందింది. చారిత్రాత్మకంగా పలువురు మహాపురుషులు, మహర్షులు నిర్మించిన ఆలయాలతోపాటు నూతనంగా నిర్మించిన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో ప్రత్యేక పర్వదినాలతో పాటు నిత్యం పూజాకార్యక్రమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేస్తున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పలు ప్రముఖ శివాలయాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ముక్తిరామలింగేశ్వరాలయం

ప్రొద్దుటూరు పట్టణంలోని పావన పినాకినీ నది తీరాన వెలసిన సుప్రసిద్ధ క్షేత్రమే ముక్తి రామలింగేశ్వరం. మార్జాలరూపంలో గల రావణున్ని రాముడు తన బాణంతో వధించి ముక్తి ప్రసాదించడం వల్ల ఈ ప్రాంతానికి ముక్తి రామలింగేశ్వరమని పేరు వచ్చింది. రావణ వధ అనంతరం తనకు ఆపాజితమైన బ్రహ్మ హత్యా దోష నివారణకు ఈ ప్రాంతంలో శివ లింగం ప్రతిష్ట చేయ సంకల్పిస్తారు. రాముడు ఆంజనేయస్వామిని కాశీ నుండి శివలింగం తీసుకురమ్మని ఆజ్ఞాపిస్తాడు. ముహూర్త సమయానికి ఆంజనేయుడు రాకపోవడంతో శ్రీరామచంద్రుడు ''సైకత లింగం'' (ఇసుకతో చేసిన శివలింగం) ప్రతిష్టించారు. తర్వాత ఆంజనేయస్వామి వచ్చి తాను తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్టించాలని పట్టుబట్టగా శ్రీరామచంద్రుడు ఆయన తెచ్చిన శివలింగాన్ని సైకత లింగానికి కొద్ది దూరంలో అభిముఖంగా ప్రతిష్టించారు. ఈ లింగాన్ని హనుమత్ లింగేశ్వరుడుగా పిలుస్తారు. సైకత లింగంపై శ్రీరాముల వారి గుర్తులను ఇప్పటికీ మనం దర్శించవచ్చు. కార్తీక మాసం సందర్భంగా ప్రతిరోజు స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారాల్లో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 10న ఉదయం 9 గంటలకు అన్నాభిషేకం, 13న సాయంత్రం తెప్పోత్సవం, 15న రాత్రి 7గంటలకు పౌర్ణమి సందర్భంగా సాయంత్రం జ్వాలా తోరణం, 24న ఉదయం 9 గంటలకు లక్షబిల్వార్చన, 25న తిరుణాల జరుగనుంది.

అగస్త్యేశ్వరాలయం

అగస్త్య మహాముని ఈ ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్టించడంతో శివలింగాన్ని అగస్త్యేశ్వర స్వామిగా భక్తులతో పిలవబడుచున్నాడు. ఆలయ ప్రాంగణంలో ఆగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి, కోందండరామస్వామి ఆలయాలు ఉన్నాయి. గర్భగుడిలో మూడు అడుగుల ఎత్తు గల అగస్త్యేశ్వరస్వామిని లింగరూపంలో ప్రతిష్టించారు. అంతరాలయంలో వీరభద్రుడు, కార్తీకేయుడు, గణపతి విగ్రహాలు ఉన్నాయి. 14 భాషల్లో నిష్ణాతులైన శతాధిక గ్రంథకర్త పుట్టపర్తి నారాయణచార్యులకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిన 'శివతాండవం' కావ్య సృష్టికి మూలం ఈ ఆలయంలోని అగస్త్యేశ్వరుడే. ఆలయంలో కార్తీక సోమవారాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు దర్శనం కోసం వేచివుంటారు. స్వామివారికి, అమ్మవారికి అభిషకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ, పౌర్ణమిరోజు రాత్రి జ్వాలాతోరణం వెలిగించనున్నారు.

అమృతేశ్వరాలయం

పావన పెన్నానది తీరంలో నిర్మించిన శ్రీ అమృతేశ్వరాలయం ఆధ్యాత్మిక కేంద్రగా ప్రసిద్ధి చెందింది. పరమశివుని ద్వాదశ జ్యోతిర్లింగాలు, అమ్మవారి అష్టాదశ శక్తిపీఠాలు, గురుపీఠాలు ఒకే చోట భక్తులకు దర్శనమిస్తాయి. అమృతేశ్వరస్వామి త్రిశూలం, రుద్రాక్ష, నాగాభరణం, డమరుకం దారుడై పులి చర్మంపై పద్మాసన స్థితిలో విగ్రహాన్ని రూపొందించారు. ఇరువైపుల సింహం నోరు తెరిచినట్లుగా కొండ గుహలను ఏర్పాటు చేసి వీటి మధ్య దేశంలోని అత్యంత ప్రాముఖ్యత పొందిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్టించారు. అమృతేశ్వరస్వామి విగ్రహం ముంద నీటి మధ్యలో నిర్మించిన గర్భగుడిలో ఘర్ నుంచి తెప్పించిన మరకత లింగాన్ని ప్రతిష్టించారు. జలపాతం చుట్టు భూగర్భంలోనే అష్టాదశ శక్తి పీఠాలైన అమ్మవారి విగ్రహాలను కొలువుంచారు. కార్తీక మాసంలో మహాశివుని రూపాలైన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒకేచోట దర్శించవచ్చు. కార్తీకమాసం సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు చేస్తున్నారు. కార్తీక పౌర్ణమిరోజు రాత్రి జ్వాలాతోరణ మహోత్సవం వేడుక నిర్వహించనున్నారు. అలాగే మహాశివునికి ప్రీతిపాత్ర కరమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు శివాలయాల్లో తొలికార్తీక మాస సోమవారం శివునికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు అలంకరణ, గ్రామోత్సవం చేయనున్నారు. ఇందుకోసం ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మ వారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణ మహోత్సవం జరుగనుంది. కార్తీక మాసం సందర్భంగా భక్తుల రద్దీని దృష్ట్యా వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశాం.

– కొత్తమిద్దె రఘురామిరెడ్డి, అగస్త్యేశ్వరస్వామి ఆలయ చైర్మన్, ప్రొద్దుటూరు

ఎగ్జిబిషన్‌లో లక్కీ డ్రా పేరుతో మోసం

నిర్వాహకులపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో లక్కీ డ్రా పేరుతో నిర్వాహకులు ప్రజలను నిలువునా మోసం చేశారు. రూ. 100 చొప్పున రూ. లక్షలు వసూలు చేసినా ఒక్కరికి కూడా లక్కీ డ్రా తగలక పోవడంతో ఆగ్రహించిన ప్రజలు నిర్వాహకులను నిలదీశారు. దీనిపై నిర్వాహకులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో మోసపోయామని గ్రహించిన సభ్యులు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రవీంద్ర అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

అట్లూరు : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీస్ ఆఫీసర్(సీపీఓ)గా స్వచ్ఛందంగా పనిచేసేందుకు అసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆసక్తిగల యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

స్టేట్ క్రికెట్ అండర్ -15కు ఎంపికైన సహస్ర



సహస్ర

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన కెప్టెన్ రాముడు మనమరాలు సవరం యోష సహస్ర స్టేట్ క్రికెట్ అండర్ 15కు గుంటూరు ఆంధ్రా క్రికెట్ అకాడమి నుంచి ఎంపికైంది. ఈ విద్యార్థిని తండ్రి రమేష్ మాజీ జవాన్. ఈనెల 21న ఆంధ్రప్రదేశ్, చండీఘర్ జట్లకు జరగనున్న మ్యాచ్‌లో సహస్ర ఆడుతుందని కెప్టెన్ రాముడు తెలిపారు.

సమయ పాలన పాటిస్తే లక్ష్యాన్ని సాధించవచ్చు

పులివెందుల ఆర్డీఓ భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష



మాట్లాడుతున్న పులివెందుల ఆర్డీఓ భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు సాధించాలనే తపన, కఠోర శ్రమ, సమయపాలన పాటిస్తే లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని పులివెందుల ఆర్డీఓ భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష తెలిపారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలలో ఆదివారం సంస్కృతి స్వచ్ఛంద సంస్థ, డాక్టర లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ సంయుక్తంగా సివిల్స్‌పై మహిళలకు ఉచిత శిక్షణ అందించడం కోసం అర్హత పరీక్ష నిర్వహించారు. దాదాపు వంద మంది మహిళలు ఈ పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన కోచింగ్ సెంటర్లు గమ్యానికి చేరుస్తాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు తెలివితేటలతోపాటు సరైన దిశానిర్దేశం సూచించే గురువులను ఎన్నుకోవడం కూడా ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ఢిల్లీకి చెందిన డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ఐఏఎస్ సాధనకు టెన్త్, ఇంటర్ మార్కులతో సంబంధం లేదన్నారు. వార్తలు వినడం, దినపత్రికలను చదవడం, సామాజిక అవగాహన ఉంటే సాధారణ ప్రజ్ఞ కలిగిన విద్యార్థులు కూడా సివిల్స్‌లో లక్ష్యాన్ని సాధించగలరన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు తమ కలలను సాకారం చేకునేందుకు డాక్టర్ లక్ష్మయ్య వారధిగా నిలవడం గరించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు కోటా ఓబుళరెడ్డి, గండికోట షేక్షావల్లి, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

లా విద్యార్థుల ర్యాంక్‌లపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌వీఎస్ ఆర్‌వీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిత, అఫీజుల్లా

ప్రొద్దుటూరు : లా విద్యార్థుల కౌన్సిలింగ్ ర్యాంక్‌లపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఆర్‌వీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిత, అఫీజుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం ప్రొద్దుటూరులో న్యాయ విద్యార్థులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ ఎల్ఏడబ్ల్యూ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఎంట్రన్స్ ఫలితాలు విడుదల చేసి శనివారం ర్యాంకుల ప్రకారం సీట్లు కేటాయించారన్నారు. అయితే ఏపీ లాసెట్‌లో ఎల్ఎల్ఎం విద్యార్థులు 2,480 మంది రాష్ట్ర వ్యాప్తంగా అప్లై చేసుకోగా 2,460 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారన్నారు. రాష్ట్రంలోని 260 ఎల్ఎల్ఎం పీజీ సీట్లకు గాను ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలో 150 సీట్లకు గాను 123 సీట్లు మొదటి విడత కౌన్సిలింగ్ జరిగిందన్నారు. ప్రధానంగా ఓపెన్ కేటగిరిలో విద్యార్థులకు అన్యాయం చేస్తూ తక్కువ ర్యాంకు వచ్చిన విద్యార్థులకు కాకుండా ఎక్కువ ర్యాంకు వచ్చిన విద్యార్థులకు సీట్లు కేటాయించారని ఆరోపించారు. బీసీ విద్యార్థులకు సీట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు ర్యాంకులు ఆధారంగా కేటాయించిన సీట్లను పునరాలోచన చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలి



సుందరయ్య కాలనీలో మొక్కలు నాటుతున్న సీఐ, డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : మొక్కలు పెంచడం ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో జరుగుతున్న అనేక రకాల మార్పులకు చెట్లు అంతరించిపోతుండటమే మూలకారణమని, ఇందు కోసం ప్రతిఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని కోరారు. యువత సమస్యలపై పోరాటాలు సాగిస్తూనే సామాజిక బాధ్యతగా చెట్లను నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని డీవైఎఫ్ఐ నాయకులను సీఐ అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.విజయకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రూరల్ కార్యదర్శి బాలగురయ్య, మహిళా కో కన్వీనర్లు ఫాతిమా, నాగేశ్వరి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

గోపవరంలో విషాదఛాయలు



చెన్నకేశవ (ఫైల్)

గోపవరం : మండలంలోని పెద్దగోపవరం గ్రామానికి చెందిన కోడూరు చెన్నకేశవ (29) అన్నమయ్య జిల్లా సంబేపల్లె వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు చెన్నకేశవ బద్వేలు పట్టణంలోని ఓ బార్బర్‌షాపులో రోజువారీ కూలీగా పనిచేసుకుని జీవనం కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతునికి భార్యతో పాటు ఆరు నెలల పాప ఉంది. తల్లితో పాటు మతిస్థిమితం లేని అన్న ఉన్నారు. కుటుంబ భారాన్ని మొత్తం చెన్నకేశవ మోస్తున్నాడు. శనివారం అన్నమయ్య జిల్లా పీలేరులోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సంబేపల్లె వద్ద ఎదురుగా వస్తున్న బొలొరా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో చెన్నకేశవ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ప్రమాద స్థలానికి చేరుకుని బోరుబోరున విలపించారు. రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక గ్రామస్తులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు చెన్నకేశవ మృతదేహం వద్ద బోరుబోరున విలపించారు. కుటుంబ భారాన్ని మోస్తున్న చెన్నకేశవ దుర్మరణం చెందడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఉద్యోగులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం

పోరుమామిళ్ల : కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి అన్ని శాఖల ఉద్యోగులు సపోర్టు చేశారని, అయితే ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ జీఓలను ఉద్యోగులపై రుద్దటం బాధాకరమని రాష్ట్ర వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఫేసియల్ రికగ్నిజేషన్ సిస్టంను ఫీల్డ్‌లో పనిచేస్తున్న కొన్ని శాఖల్లో తీసివేయడం జరిగిందన్నారు. ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ అయిన వైద్య ఆరోగ్యశాఖలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు ఎఫ్ఆర్ఎస్ వేయాలనడం మూర్ఖత్వమన్నారు. ఉదయం 9కి ముందు, సాయంత్రం 4 గంటల తర్వాత ఎపిడమిక్ డ్యూటీస్, జూమ్ మీటింగులకు హాజరు కాకపోతే ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో తెలియచేయాలన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులైన డాక్టర్స్, సెకండ్ ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పీలకు అక్టోబర్ నెల జీతంలో భారీగా కోత విధించడం అన్యాయమన్నారు. త్వరలో రెగ్యులర్ ఉద్యోగులకు కూడా ఎఫ్ఆర్ఎస్‌ను లింక్‌పెట్టి జీతాల్లో కోత విధిస్తారని ఉద్యోగులు ఆదోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఎఫ్ఆర్ఎస్ సిస్టాన్ని రద్దు చేయాలని శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. 143/32 జీఓ వల్ల అనేకమంది వైద్య ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ జీఓపై గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు వ్యతిరేకించారన్నారు. ఇప్పుడు ఆ జీఓను తొలగించాలన్నారు.

రెగ్యులర్ వ్యవసాయాధికారిని నియమించరా ?

గోపవరం : మండలానికి రెగ్యులర్ వ్యవసాయాధికారిని నియమించరా అని రైతులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న అరవిందనాయక్ ఉన్నత చదువుల నిమిత్తం దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళారు. ఆయన స్థానంలో అట్లూరు మండలంలో పనిచేస్తున్న రామకృష్ణయ్యను గోపవరం మండలానికి ఇన్‌చార్జిగా నియమించారు. రెండేళ్ళు గడుస్తున్నా ఇంత వరకు రెగ్యులర్ ఏఓను నియమించకపోవడంతో వ్యవసాయ పరంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం రైతుసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందిపైనే ఆధారపడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ వ్యవసాయాధికారి ఉన్నట్‌లైతే ఎప్పటికప్పుడు పంటల సాగు, వ్యాపించే చీడపీడల పట్ల రైతులకు సరైన సమాచారం అందించేవారని, ప్రస్తుతం మండలంలో ఆ పరిస్థితి లేదని రైతులు ఆరోపిస్తున్నారు. శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధులు రెగ్యులర్ ఏఓను నియమించాలని అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రెగ్యులర్ వ్యవసాయాధికారిని నియమించి రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

చిన్నారి హత్యచేసిన నిందితుడిని శిక్షించాలి

బద్వేలు అర్బన్ : తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో మూడున్నరేళ్ళ చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా తెలిపారు. ఆదివారం ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముక్కుపచ్చలారని మూడున్నరేళ్ళ గిరిజన చిన్నారిపై అతి కిరాతకంగా లైంగిక దాడి చేసి హత్య చేయడం దారుణమైన విషయమని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవడంతో పాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఎస్.ఏ.సత్తార్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

నేడు శిక్షణ కార్యక్రమం

అట్లూరు : సచివాలయాల సిబ్బందికి నైపుణ్య గణనపై సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ భాస్కర్‌బాబు తెలిపారు.

30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి



మాట్లాడుతున్న వెంకటజనార్ధన్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకటజనార్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక శ్రీరాములపేట ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలును ఆలస్యం చేయడం ద్వారా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ ఒకటో తేదీన జీతం కూడా ఉద్యోగులకు గగనం అయిందని అన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రతి ఉద్యోగికి ఒకటో తేదీన జీతం ఇస్తామని చెప్పి ఇలా చేయడం తగదన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రిజ్వాన్ ఆలీ మాట్లాడుతూ పీఆర్సీ నివేదిక సత్వరమే తెప్పించుకుని వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 2003 డీఎస్సీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగ చంద్రుడు, పట్టణ కార్యదర్శి మధుసూదన్, పెద్దముడియం అధ్యక్షుడు చంద్రశేఖర్, మురళీమోహన్, జమాల్ రెడ్డి, పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

ప్రొద్దుటూరు : కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు నూతన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. ఆదివారం మండలంలోని ఈశ్వర్‌రెడ్డినగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం డిసెంబర్‌లో జిల్లా సదస్సును ప్రొద్దుటూరులో నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని ఈనెల 18న జిల్లాలోని అన్ని సచివాలయాల్లో వినతి పత్రాలను అందించాలని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జిల్లా సమస్యలపై భవిష్యత్తు ఉద్యమాల కోసం ఆయా నాయకత్వాలను సిద్ధం చేసేందుకు బద్వేలులో జిల్లా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 26 నాటికి సీపీఐ సభ్యత్వాల పునరుద్ధరణ చేపట్టి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సమితి సభ్యులు శివారెడ్డి, వై.హరి, రామకృష్ణ, మచ్చా శ్రీనివాసులు, హుస్సేన్, భాస్కర్, ప్రమీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే మానవ జీవితానికి సార్థకత



సేవాశ్రమంలో సుజాతను సన్మానిస్తున్న సేవాశ్రమం నిర్వాహకులు

కాశినాయన : సమాజానికి సేవ చేయడం వల్లనే మానవ జీవితానికి సార్థకత లభిస్తుందని తిరుపతికి చెందిన సామాజిక సేవకురాలు జి.సుజాత తెలిపారు. ఆదివారం మండలంలోని ఓబుళాపురం సగిలేరు వద్ద ఉన్న వివేకానంద సేవాశ్రమంలో అవసాన దశలో ఉండి తమ పనులు తాము చేసుకోలేని అభాగ్యుల కోసం నిర్మించిన ప్రత్యేక గదులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో తమ పనులు తాము చేసుకోగలిగిన వారికి చేయూతను అందించడంతో పాటు తమ పనులు తాము చేసుకోలేని అభాగ్యులకు ఆశ్రమం కల్పించి సేవలు చేయడం భగవంతునికి సేవ చేయడంతో సమానమన్నారు. చిన్న వయస్సులోనే గొప్ప సేవ చేస్తున్న సేవాశ్రమం వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డిని ఆమె అభినందించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆమెను సత్కరించారు. గదుల నిర్మాణానికి సహకరించిన దాతలకు రామకృష్ణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వీరాస్వామి, మాజీ సైనికుడు బాలుడు, వివేకానంద ఫౌండేషన్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పోలీసులు



నాడు ముళ్ళపొదలతో నిండిన గోపవరం ఆర్టీసీ బస్టాండు



నేడు ముళ్ళపొదలను తొలగించి శుభ్రపరిచిన బద్వేలు రూరల్ పోలీసులు

గోపవరం : గోపవరం మండల కాంప్లెక్స్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన ముళ్ళపొదలతో నిండి నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండును బద్వేలు రూరల్ పోలీసులు శుభ్రం చేశారు. 1999–2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మండల కాంప్లెక్స్ వద్ద ఆర్టీసీ బస్టాండును ఏర్పాటు చేశారు. అయితే ఈ బస్టాండులోకి కొద్దిరోజులు మాత్రమే బద్వేలు ఆర్టీసీ డిపో వారు బస్సులు రాకపోకలు కొనసాగించారు. ఆ తర్వాత బస్సులు నిలిపివేయడంతో క్రమేనా నిరుపయోగంగా మారి కంపచెట్లతో నిండిపోయి అక్కడ బస్టాండు ఉందన్న విషయాన్ని కూడా గుర్తించేవారు కాదు. దీంతో ఈ బస్టాండు అసాంఘీక కార్యక్రమాలకు, మందుబాబులకు నిలయంగా మారింది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది జేసీబీ సాయంతో ముళ్ళపొదలను తొలగించి బస్టాండును శుభ్రం చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పోలీసులు చూపిన చొరవ అభినందనీయమని స్థానికులు కొనియాడారు.